
# కాపాడుకున్నోళ్లపై భస్మాసుర హస్తం

**సీనియర్లను కాదని కొత్తవాళ్లకు పీఠం**



**వరంగల్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి):** కాంగ్రెస్ రెండో విడుత జాబితా విడుదల అనంతరం హస్తం పార్టీలో అసంతృప్తి సెగలు మరింత ఎగిసిపడుతున్నాయి. వారం క్రితం పార్టీలో చేరినవారికి టిక్కెట్లు ఇవ్వడంపై ఏండ్ల తరబడి పార్టీకోసం పనిచేస్తూ వచ్చిన నాయకులు భగ్గుమంటున్నారు. వరంగల్ పశ్చిమం, పరకాల, హుస్నాబాద్‌లో అసమ్మతి తీవ్రస్థాయిలో ఉన్నది. ఇక్కడ టిక్కెట్ ఆశించిన ముఖ్యనేతలు తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలో నిలిచేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. శనివారం తమ అనుచరులతో సమావేశాలు నిర్వహించారు. కార్యకర్తల సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ తమను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్ధన్నపేట, మహబూబాబాద్, పాలకుర్తిలోనూ అసమ్మతులు మొదలయ్యాయి. టిక్కెట్ రాని నేతలు అంతర్గతంగా సమావేశాలు నిర్వహించుకుంటున్నారు.



- టికెట్ల కేటాయింపుపై తీవ్ర అసమ్మతి సెగలు
- పరకాలలో ఇనగాల.. పశ్చిమంలో జంగా ఫైర్
- అనుచరులతో మీటింగులు.. సొంతంగా పోటీకి అడుగులు
- ఇనగాల ఇంటికి వెళ్లిన రేవూరి
- కలిసేందుకు నిరాకరించిన వెంకట్రాంరెడ్డి
- రేవూరికి వ్యతిరేకంగా ఇనగాల అనుచరుల నినాదాలు
- అధిష్టానం తరఫున వెళ్లిన స్వర్ణ, నాయిని
- హుస్నాబాద్‌ను పారుగోళ్లకు ఇస్తారా అంటూ అల్గిరెడ్డి ఆగ్రహం
- బీసీలకు మొండి 'చెయ్యి'పై కేయూ విద్యార్థుల మండిపాటు

### ఇనగాల సొంత దారి

కాంగ్రెస్ పార్టీ నిర్ణయంపై ఇనగాల వెంకట్రాంరెడ్డి తిరుగుబాటు జెండా ఎగురవేశారు. పదేండ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న తనకు అవకాశం ఇవ్వలేదని వాపోయారు. వారం క్రితం పార్టీలో చేరిన నర్సంపేట నియోజకవర్గ నేత రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఇక్కడ టిక్కెట్ ఇవ్వడమేమిటని నిలదీస్తున్నారు. తన అనుచరులతో సమావేశమై ఎట్టి పరిస్థితుల్లోనూ బరిలో ఉండేలా కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. పరకాల టికెట్ దక్కిన రేవూరి శనివారం ఉదయం ఇనగాలను కలిసేందుకు వెళ్లగా 'రేవూరి గో బ్యాక్' అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఇనగాల అనుచరుల హెచ్చరికలతో రేవూరి అక్కడి నుంచి వెళ్లిపోయారు. వరంగల్, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, నాయిని రాజేందర్‌రెడ్డి ఇనగాల ఇంటికి వెళ్లి చర్చించారు. కాంగ్రెస్ అధిష్టానానికి అంతా నివేదిస్తామని చెప్పారు. అనంతరం వెంకట్రాంరెడ్డి కార్యకర్తలతో సమావేశమయ్యారు.

### అల్గిరెడ్డి తిరుగుబాటు

హుస్నాబాద్ టిక్కెట్ స్థానికులకు కాకుండా కరీంనగర్‌కు చెందిన పొన్నం ప్రభాకర్‌కు ఇవ్వడంపై మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తిరుగుబాటు మొదలుపెట్టారు. ప్రవీణ్‌రెడ్డికి టిక్కెట్ రాలేదనే సమాచారం తెలిసి నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శనివారం ఆయన ఇంటికి వచ్చారు. కాంగ్రెస్ తనను నమ్మించి మోసం చేసిందని ప్రవీణ్‌రెడ్డి మండిపడ్డారు. తడిగుడ్డతో గొంతు కోసిందని ఆవేదన చెందారు. హుస్నాబాద్ ఆత్మగౌరవాన్ని వదిలేది లేదని చెప్పారు. హుస్నాబాద్ టిక్కెట్ దక్కిన పొన్నం ప్రభాకర్ శనివారం ఉదయం ప్రవీణ్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఎన్నికల్లో తన గెలుపు కోసం సహకరించాలని కోరగా ఆయన విజ్ఞప్తిని ప్రవీణ్‌రెడ్డి సున్నితంగా తిరస్కరించారు. అనంతరం ప్రవీణ్‌రెడ్డి కార్యకర్తలతో సమావేశమయ్యారు.

### కేయూ ఉద్యమకారుల ఆగ్రహం

కాంగ్రెస్ టిక్కెట్ల కేటాయింపులో కేయూ ఉద్యమకారులకు, బీసీలకు అన్యాయం జరిగిందని కేయూ ఉద్యమకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసి తమ నిరసన తెలిపారు. టిక్కెట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ బీసీలకు అన్యాయం చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రవర్ణాలకు ప్రాధాన్యమిస్తున్న కాంగ్రెస్, ఈ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని మండిపడ్డారు.

### పశ్చిమ బరిలో జంగా

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో టిక్కెట్ ఆశించిన డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అధిష్టానం నిర్ణయంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తమ అనుచరులు, కార్యకర్తలతో సమావేశమై వరంగల్ పశ్చిమంలో కచ్చితంగా పోటీలో ఉండే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రెండు రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తానని చెప్పారు. 'యుద్ధానికి ఆయుధంతో సిద్ధంగా ఉన్న. ప్రజలు నన్ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు. కొత్తగా వచ్చిన రేవూరికి, నాగరాజుకు, యశస్వినికి టికెట్లు ఇచ్చారు. నాకు మాత్రం ఇవ్వలేదు. పార్టీ మీటింగ్స్‌కు కోట్ల రూపాయలు ఖర్చు చేశా. నాపై కుట్ర చేసి, ఒక అసమర్థునికి టికెట్ ఇచ్చారు.' అంటూ మండిపడ్డారు. అవసరమైతే ఏదో ఒక పార్టీ మద్దతు తీసుకొని ఒకట్రెండు రోజుల్లో తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.



అనుచరులతో సమావేశమైన ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి

# రేవూరికి టికెట్ ఇచ్చుడేంది?

**నిన్నగాక మొన్నొచ్చినవారికి సీటా.. పార్టీ కోసం పనిచేసేవారికి కాంగ్రెస్‌లో గుర్తింపు లేదు**

**12ఏండ్లుగా పరకాలలో పార్టీని కాపాడుతున్నా..**

**అవసరమైతే కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తా.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటా..**

**కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి**

**హనుమకొండలోని తన నివాసంలో అనుచరులు, ముఖ్యనాయకులతో సమావేశం**

పరకాల, అక్టోబర్ 28 : 'పార్టీ కోసం పనిచేసే వారికి కాంగ్రెస్‌లో గుర్తింపు లేదు. పరకాల నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం 12 ఏండ్లుగా కష్టపడుతున్నా.. నాకు టికెట్ ఇవ్వకుండా వారం కింద చేరిన రేవూరి ప్రకాశ్ రెడ్డికి టికెట్ ఇచ్చుడేంది?' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పరకాల టికెట్ రేవూరికి కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ హనుమకొండలోని తన నివాసంలో అనుచరులు, ముఖ్య నాయకులతో శనివారం సమావేశమయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. 'కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్న రోజు నుంచి నేటి వరకు క్రమశిక్షణ గల నాయకుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేసిన. అయినా నాకు గుర్తింపు ఇవ్వకుండా వలస నాయకులకు టికెట్ ఇచ్చిన్రు. కొంత మంది అధిష్టానం పెద్దల సూచనతో పరకాల టికెట్ నాకే వస్తుందని శుక్రవారం వరకు ఆశపడ్డ. కానీ, కాంగ్రెస్ పెద్దలు నాకు మొండిచెయ్యి చూపెట్టిన్రు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే కాంగ్రెస్‌కు రాజీనామా చేసి స్వతంత్రంగా బరిలోకి దిగుతానని చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. తన ఇంటికి వచ్చిన అధిష్టానం దూతలు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి శోభారాణి సర్ది చెప్పినా ఇనగాల శాంతించలేదు. తనకు 24గంటల్లో టికెట్ కేటాయించకుంటే తనదారి తాను చూసుకుంటానని వారిని హెచ్చరించారు.

# తడిగుడ్డతో గొంతు కోసింది

**నయవంచక కాంగ్రెస్.. ఇక్కడి స్థానికులు అసమర్థులా?**

**హుస్నాబాద్ ఆత్మగౌరవం వదిలేద్దామా?**

**ఇంట్లో ఉన్నవాన్ని పిలిచి కండువా కప్పి మోసం చేశారు**

**కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి**

భీమదేవరపల్లి, అక్టోబర్ 28 : 'నియోజకవర్గంలో తిరుగమంటరు.. నీ వెనుక మేమున్నమంటరు.. పల్లెల్లో పాదయాత్ర చేసిన తర్వాత మరొకరికి టికెట ఇస్తరు.. తడిగుడ్డతో కాంగ్రెస్ నా గొంతు కోసింది' అని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి కార్యకర్తల ఎదుట తీవ్ర ఆవేదన చెందారు. శనివారం మండలంలోని ముల్కనూరులోని ఆయన నివాసంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. 'హుజూరాబాద్ బై ఎలక్షన్‌లో కాంగ్రెస్ తరఫున టిక్కెట్ ఇస్తమన్నరు..కేతిరి సుదర్శన్‌రెడ్డి ఉన్నారని వద్దన్నా.. నియోజకవర్గ విభజన తర్వాత హుస్నాబాద్ నుంచి టిక్కెట్ ఇస్తమన్నరు.. బొమ్మ వెంకన్న అంగీకరిస్తే సరే అని చెప్పిన.. అధిష్టానం టిక్కెట్ ఇస్తే గెలిచి వచ్చి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన. 2018లో కాంగ్రెస్ టిక్కెట్ ఇస్తామని చెప్పింది. గ్రామగ్రామాన పార్టీని బలోపేతం చేసిన. సీపీఐకి పొత్తులో హుస్నాబాద్ పోతుంది అంటే ప్రచారం మానుకుంటానని చెప్పిన.. లేదు లేదు స్నేహపూర్వక పోటీ అన్నరు. ఆ రోజు సాయంత్రం కల్లా బీ ఫామ్ ఇవ్వలే.. హైదరాబాద్‌లో నేనే కాదు నాయిని రాజేందర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ఆదిలాబాద్ నుంచి ఇద్దరు, హైదరాబాద్‌లో ఒక్కరు ఇట్ల చాలామందిమి ఉన్నం.. నామినేషన్ వేసేందుకు సిద్ధం కమ్మన్నరు. తీరా గాంధీభవన్‌కు వెళ్లేసరికి కాంగ్రెస్ పెద్దలు ఫోన్లు స్విచ్‌ఆఫ్ పెట్టుకున్నరు. ఎట్లనో కౌశిక్‌రెడ్డికి మాత్రం అప్పుడు బీఫామ్ ఇచ్చిన్రు. నేను కాంగ్రెస్‌ను ఏనాడూ విమర్శించలేదు.. అప్పుడు నా కార్యకర్తలు ఆగం కావద్దని బీఆర్‌ఎస్‌లో చేరిన. రాజకీయాలు వదిలి నా పనులు నేను చేసుకుంటుంటే మళ్లీ నన్ను కాంగ్రెస్‌లోకి రమ్మన్నరు. ఒకసారి జరిగిన అవమానం చాలని చెప్పిన. మూడు సర్వేలు చేసినం నియోజకవర్గంలో నీ పేరే ముందున్నది. గ్రామాల్లోకి వెళ్లమని చెప్పిండ్రు. అయినా నేను నమ్మలేదు. చివరికి నన్ను ఢిల్లీకి తీస్కపోయి కాంగ్రెస్ కండువా కప్పిండ్రు. ఊరూరా పాదయాత్ర చేసిన. 80కి పైగా గ్రామాలు తిరిగి కాంగ్రెస్ బలోపేతం కోసం పనిచేసిన. హుస్నాబాద్ నియోజకవర్గ టిక్కెట్ కోసం నాతోపాటు పొన్నం ప్రభాకర్ దరఖాస్తు చేసుకున్నడు. అప్పటికే పలుమార్లు వాళ్లను అడిగినా లేదు లేదు నువ్వే ప్రచారం చేసుకో అన్నరు. తీరా సమయానికి తడిగుడ్డతో గొంతు కోసిండ్రు. హుస్నాబాద్ నియోజకవర్గంలో స్థానికులు లేరా? లేక వారు అసమర్థులా? పార్టీని బలోపేతం చేసి వచ్చాక కుర్చీలో స్థానికేతరులు కూర్చుంటారా' అని మండిపడ్డారు. హుస్నాబాద్ ఆత్మగౌరవాన్ని వదిలి వలస నాయకులను తెచ్చుకుందామా? అని ప్రశ్నించారు. 'నాకు వ్యవస్థలో గుర్తింపు ఉంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం అధ్యక్షుడిగా ఉన్నా. ఇంట్లో ఉన్నవాన్ని పిలిచి కండువా కప్పి మోసం చేస్తారా?' అని ఆవేదన చెందారు. మరోసారి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడించారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

## రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కేయూ నాయకులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 28: కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద బీసీ సంఘం, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. కేయూ నుంచి ఎవరికీ టికెట్లు కేటాయించకపోగా ఉద్యమకారులు, విద్యార్థులు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నట్లు ఉద్యమకారుడు సూదగాని మధుగౌడ్ తెలిపారు. కేయూ ఉద్యమ నాయకులకు కాంగ్రెస్ టికెట్ కేటాయిస్తుందని భావించినా చివరికి మొండిచెయ్యి చూపించడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. బీసీలకు మొండిచెయ్యి చూపి అగ్రవర్ణాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ టిక్కెట్లు ఆశించిన నేతలతో స్వతంత్రంగా నామినేషన్లు వేయిస్తామన్నారు. ఇక్కడ శ్రీశైలం, అజిత్, రాజ్‌కుమార్, నవీన్, ప్రేమ్, రాజశేఖర్, శ్రవణ్ ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత జంగా రాఘవరెడ్డి

# కేయూ భూములు అమ్ముకున్న నాయినికి టికెట్టా..?

**కాంగ్రెస్‌లో కొత్తగ వచ్చినవారికి టికెటిచ్చి నన్ను పక్కన బెట్టారు**

**నాకు టికెట్ ఇవ్వకుంటే ఆరు నియోజకవర్గాల్లో పార్టీ దెబ్బ తినడం ఖాయం**

**వరంగల్ పశ్చిమలో వినయ్‌భాస్కర్‌కు నాకే పోటీ**

**రెండురోజుల్లో భవిష్యత్ కార్యాచరణ**

**కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగా రాఘవరెడ్డి**

కాజీపేట, అక్టోబర్ 28 : 'కాంగ్రెస్ అధిష్టానం బేషరతుగా నాకు వరంగల్ పశ్చిమ టికెట్ ఇవ్వాలి.. లేదంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ దెబ్బతినడం ఖాయం' అని డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగా రాఘవరెడ్డి తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. కాంగ్రెస్ నుంచి వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించి భంగపడిన ఆయన గ్రేటర్ 64వ డివిజన్‌లోని వ్యవసాయ క్షేత్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 'అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉండేందుకు నేను సిద్ధంగా ఉన్న. పార్టీలో సీనియర్‌ను అయిన నన్ను కాదని కేయూ భూములను అమ్ముకున్న, గతంలో పార్టీని భ్రష్టు పట్టించిన, అసమర్థుడు నాయిని రాజేందర్‌రెడ్డికి టికెట్ ఇవ్వడం ఎంతవరకు సమంజసం?' అని ప్రశ్నించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కొత్తగా వచ్చిన రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్విని రెడ్డికి టికెట్లు ఇచ్చి పార్టీకి అన్ని విధాలా అండగా ఉన్న తనను విస్మరించడం ఏమిటని నిలదీశారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ సమావేశాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేశానని ఆవేదన చెందారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు తన స్వలాభం కోసం పార్టీని నట్టేట ముంచి బయటకు వెళ్లిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఏ సర్వే ప్రకారం టికెట్ ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోని కొందరు పెద్దలు తమ స్వలాభం కోసం వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న పార్టీని నాశనం చేస్తున్నారని విమర్శించారు. తాను ఏనాడూ కాంగ్రెస్‌ను మోసం చేయలేదని, భద్రకాళి అమ్మవారిమీద ప్రమాణం చేస్తానని, నాయిని కూడా చేసేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో తన నాయకులు, కార్యకర్తలు ఉన్నారని, వారి సూచన మేరకు రెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు.

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి దాస్యంకు తనకు మధ్యే పోటీ ఉంటుందని, నాయిని పోటీ దరిదాపులో కూడా ఉండడన్నారు. ఆయన వెంట కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ సయ్యద్ రాజాలీ, మాజీ కార్పొరేటర్లు తోట్ల రాజు, రేపల్లె శ్రీనాథ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రంగనాథ్, హనుమకొండ పార్లమెంటరీ యూత్ అధ్యక్షుడు కొడిపాక గణేశ్, కట్ల శ్రీనివాస్, ధనరాజు, రాజు, వస్కుల శంకర్, సందెల విజయ్ ఉన్నారు.

# మానుకోటలో తీవ్ర అసంతృప్తి

- **టికెట్ దక్కక బెల్లయ్యనాయక్, బలరాంనాయక్ అజ్ఞాతంలోకి..**
- **మురళీనాయక్‌కు సహకరించడంపై సందిగ్ధం**
- **బుజ్జగించలేక తలపట్టుకుంటున్న పెద్దలు**

మహబూబాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : శుక్రవారం రాత్రి వెల్లడైన జాబితాలో తమ పేరు లేకపోవడంతో మానుకోట అసెంబ్లీ టికెట్‌పై ఆశలు పెట్టుకున్న ఆ ఇద్దరు కాంగ్రెస్ నేతల్లో అసంతృప్తి మొదలైంది. మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ప్రముఖంగా ముగ్గురు పోటీపడగా ఎట్టకేలకు డాక్టర్ మురళీనాయక్‌కు టికెట్ దక్కింది. గత రెండు పర్యాయాలు ఈ స్థానం నుంచి లంబాడా హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ టికెట్ ఆశించినా ఫలితం దక్కలేదు. అలాగే కేంద్ర మాజీ సహాయ మంత్రి బలరాం నాయక్ 2018లో మానుకోట అసెంబ్లీ నుంచి, 2019లో ఎంపీ స్థానానికి పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఈసారి టికెట్ ఇస్తే ఎలాగైనా గెలుస్తాననే ధీమాతో అధిష్టానం వద్ద మొరపెట్టుకున్నప్పటికీ బలరాం నాయక్‌కు టికెట్ దక్కలేదు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి ముందునుంచీ మురళీనాయక్‌కే టికెట్ ఇప్పిస్తాడనే ప్రచారం జోరుగా సాగింది. ఊహించినట్టే మురళీనాయక్ పేరు ఖరారు కావడంతో ఇదే స్థానంపై ఆశపెట్టుకున్న బలరాం నాయక్, బెల్లయ్యనాయక్‌ల భంగపాటే ఎదురైంది. మురళీనాయక్ టికెట్ ఖరారైన మరుక్షణం నుంచి తీవ్ర అసంతృప్తిలో ఆశావహులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇప్పటికే ఒకరిద్దరు నాయకులు ఢిల్లీలో ఉండి మురళీనాయక్ పేరును చివరి నిమిషం వరకు మార్చే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. బెల్లయ్యనాయక్ హైదరాబాద్‌లో లంబాడా నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. పేరు మార్పు సాధ్యం కాకపోతే వారు భవిష్యత్ కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. బహిరంగంగా ఆందోళనలు చేయనప్పటికీ లోలోన రగిలిపోతున్నారు. మరి బలరాం నాయక్, బెల్లయ్య నాయక్‌లు మురళీనాయక్‌కు సహకరిస్తారా లేదోనని సందిగ్ధం నెలకొంది. ఈ క్రమంలో అసంతృప్త నేతలను ఎలా బుజ్జగించాలోన తెలియక కాంగ్రెస్ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

- **ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం**
- **నియోజకవర్గాల్లో గులాబీ అభ్యర్థుల సందడి**
- **బ్రహ్మరథం పడుతున్న సబ్బండ వర్గాలు**



వెంకటాపూర్‌లో లంబాడాలతో మమేకమై నృత్యం చేస్తున్న ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి

# ఊరూరా బీఆర్‌ఎస్ జోరు..



బచ్చన్నపేట : తమ్మడపల్లిలో వృద్ధురాలిని ఓటు అడుగుతున్న జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి



భూపాలపల్లిలో బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ఆసక్తిగా చూస్తున్న ఓ వృద్ధురాలు

*అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో 'కారు' దూసుకుపోతోంది. ఇప్పటికే జోరు పెంచిన బీఆర్‌ఎస్ అభ్యర్థులు.. అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోతో ప్రజల్లోకి వెళ్లి వారి ఆశీర్వాదం కోరుతున్నారు. మరి కొద్ది రోజుల్లో జరగబోయే ఎన్నికల్లో తమను నిండుమనస్సుతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థిస్తూ ముందుకుసాగుతున్నారు. ఈ సందర్భంగా శనివారం ఉమ్మడి జిల్లాలోని పలు సెగ్మెంట్లలో అభ్యర్థులు ఊరువాడన విస్తృతంగా ప్రచారం చేశారు. అన్ని వర్గాలకు మేలు చేసే బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ప్రచారానికి వచ్చిన అభ్యర్థులకు అడుగడుగునా స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పడుతున్నారు.*

**- నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 28**



చిన్నగూడూరు : ప్రచారంలో భాగంగా ఉగ్గంపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్



నర్సంపేట రూరల్ : ఆత్మీయంగా పలకరింపుల నడుమ దివ్యాంగులతో కలిసి భోజనం చేస్తున్న నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి